నేటి దినపత్రిక
సూర్య
18వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం | 24 ఫిబ్రవరి 2025 | పేజీలు 8

# మంత్రికి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మూలాపేట శ్రీ భువనేశ్వరీ సమేత శ్రీ మూలస్థానేశ్వర స్వామి వారి దేవస్థానంలో మార్చి 5 వరకు జరుగు మహాశివరాత్రి బ్రహ్మోత్సవ వేడుకలకు దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి ఆదివారం ఉదయం ఆయన నివాసంలో దేవస్థాన కార్యనిర్వహణ అధికారి, ఆలయ ప్రధానార్చకులు ఆహ్వాన పత్రికను అందించారు. స్వామి, అమ్మవార్ల కృప మంత్రికి చేకూరాలని వేద పండితులు ఆశీర్వదించారు. కార్యక్రమంలో దేవాలయ అధికారులు తదతరులు పాల్గొన్నారు.

## పటిష్ట బందోబస్త్ నడుమ ముగిసిన

# సీఎం పర్యటన



**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** పటిష్ట బందోబస్తు నడుమ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన విజయవంతంగా ముగిసిందని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు. సమయ పాలనతో బందోబస్తు నిర్వహించిన హోమ్ గార్డు సిబ్బంది నుండి అధికారుల వరకు ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేశారు. హెలిపాడ్, కన్వెన్షన్ సెంటర్, ప్రదేశాలలో ప్రజలతో సహేతుకంగా మెలుగుతూ ప్రశాంతంగా బందోబస్తు నిర్వహించామన్నారు. ఎటువంటి అంతరాయం లేకుండా ట్రాఫిక్ నియంత్రణ, రూట్, పార్కింగ్, కాన్వాయ్, కమ్యూనికేషన్, అన్ని సెక్టార్లలో బందోబస్త్ సమర్ధవంతంగా అమలు చేయడం జరిగిందన్నారు. సహకరించిన ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అన్ని విభాగాల అధికారులు, సిబ్బందికి ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు.

## బీదా రవిచంద్ర కుమారుని వివాహానికి హాజరైన

# ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

- నూతన వధూవరులను ఆశీర్వదించిన సీఎం
- హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలికిన మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు నెల్లూరులో ఘన స్వాగతం లభించింది. ఆయన మధ్యాహ్నం నెల్లూరు రూరల్ మండలం కనుపర్తిపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకున్నారు. హెలిపాడ్ వద్ద రాష్ట్ర పురపాలక పట్టనాభివృద్ధి శాఖామంత్రి పొంగూరు నారాయణ, స్థానిక ఎంఎల్ఏ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, కందుకూరు ఎంఎల్ఏ ఇంటూరి నాగేశ్వరరావు, సూళ్ళూరు పేట ఎంఎల్ఏ విజయశ్రీ, డిప్యూటీ మేయర్లు రూప్ కుమార్ యాదవ్, తహాశీన్ స్థానిక నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, సివిల్ సప్లైస్ డైరెక్టర్ పట్టాభి రామిరెడ్డి, మాజీ మంత్రి పరసా రత్నం, మాజీ ఎంఎల్ఏ కంభం విజయరామి రెడ్డి, జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, జాయింట్ కలెక్టరు కె.కార్తీక్, టీజీపీ స్పెషల్ కలెక్టర్ శీనా నాయక్, కావలి ఆర్డీవో -మిగతా 2లో

## ప్రజలకు ఆరోగ్యం, ఆనందం అందించడమే

# ప్రభుత్వ లక్ష్యం




### మంత్రి పొంగూరు నారాయణ

రాష్ట్ర ప్రజలకు ఆహ్లాదం, ఆరోగ్యం, ఆనందం అందించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. ఆదివారం నెల్లూరు నగరంలోని 44వ డివిజన్ మహబూబ్ ఖాన్ పార్కు, 4వ డివిజన్ శ్రీరామ్ నగర్ పార్క్‌లలో జిమ్ ఎక్విప్మెంట్ ఏర్పాటుకు మంత్రి నారాయణ శంకు స్థాపన చేశారు. అనంతరం గత వారంలో జిమ్ ఎక్విప్మెంట్ ఏర్పాటుకు శంకుస్థాపన చేసిన ఎస్‌విఆర్ పార్క్‌ను పరిశీలించి 49వ డివిజన్ గుంటబడి మున్సిపల్ ఆదర్శ పాఠశాలలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు.

# విద్యతోనే దేశాభివృద్ధి

- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి
- ఠాగూర్ స్కూల్లో 30వ వార్షికోత్సవ వేడుకలు




**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :**

విద్యతోనే అన్ని విధాలా అభివృద్ధి చెందుతారని దేశం కూడా అభివృద్ధి చెందుతుందని తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాత్రి మండల కేంద్రమైన ఏఎస్ పేటలోని ఠాగూర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జరిగిన 30వ వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మెట్ట ప్రాంతమైన ఏఎస్ పేటలో ఠాగూర్ పాఠశాలలో స్థాపించి అంచలంచెలుగా అభివృద్ధి చెందుతూ.. 30 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా.. ఘనంగా వార్షికోత్సవ వేడుకలను కరస్పాండెంట్ సిహెచ్ వెంకటరమణరెడ్డి, హెచ్ఎం కె.దొరసామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వార్షికోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న -మిగతా 2లో



# ప్రశాంతంగా గ్రూప్ 2 మెయిన్స్ పరీక్షలు




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

జిల్లా వ్యాప్తంగా ఏడు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు పరీక్షల సమన్వయ అధికారి, కందుకూరు సబ్ కలెక్టర్ టి.శ్రీపూజ తెలిపారు. ఆదివారం ఉదయం నిర్వహించిన పరీక్షలకు 4102 మంది అభ్యర్థులకు గాను 3548 అభ్యర్థులు హాజరు కాగా, 554 మంది అభ్యర్థులు గైర్హాజరై, 86.5 శాతం హాజరు నమోదైనట్లు ఆమె తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 4102 మంది అభ్యర్థులకు గాను 3546 అభ్యర్థులు హాజరు కాగా, 556 మంది అభ్యర్థులు గైర్హాజరై, 86.4 శాతం హాజరు నమోదైనట్లు తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాలను కూడా విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించినట్లు ఆమె చెప్పారు.

# ప్రజలకు ఆరోగ్యం, ఆనందం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

## మంత్రి పొంగూరు నారాయణ



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రజలకు ఆహ్లాదం, ఆరోగ్యం, ఆనందం అందించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. ఆదివారం నెల్లూరు నగరంలోని 44వ డివిజన్ మహబూబ్ ఖాన్ పార్కు, 4వ డివిజన్ శ్రీరామ్‌నగర్ పార్క్‌లలో జిమ్ ఎక్విప్మెంట్ ఏర్పాటుకు మంత్రి నారాయణ శంకుస్థాపన చేశారు. అనంతరం గత వారంలో జిమ్ ఎక్విప్మెంట్ ఏర్పాటుకు శంకుస్థాపన చేసిన ఎస్‌విఆర్ పార్క్‌ను పరిశీలించి 49వ డివిజన్ గుంటబడి మున్సిపల్ ఆదర్శ పాఠశాలలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలకు ఆహ్లాదం, ఆరోగ్యం, ఆనందం అందించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. గతంలో తాము స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా కోట్ల రూపాయల వ్యయంతో నెల్లూరు నగరంలోని అన్ని పార్కులను అభివృద్ధి చేశామని, వాటికి కనీస నిర్వహణ లేకపోవడంతో కొట్లాది రూపాయల జిమ్ ఎక్విప్మెంట్ పాడైపోయి, పార్కులు అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారిపోయాయన్నారు. ప్రజలు చెల్లించిన వివిధ రకాల పన్నులను ఇతరత్రా పనులకు మళ్లించి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారన్నారు. అనుభవ లేమితో ఆర్థిక, క్రమశిక్షణ లేకుండా వ్యవస్థలను అస్తవ్యస్తంగా తయారు చేశారన్నారు. నిర్వీర్యమైన వ్యవస్థలన్నింటినీ గత ఎనిమిది మాసాలుగా క్రమ పద్ధతిలో పెడుతూ.. ఆర్థికంగా కుదుటపడే విధంగా చర్యలు చేపట్టామన్నారు. రాబోయే మూడు నెలల్లో నగరంలోని పార్కులన్నింటినీ అభివృద్ధిపరిచి నగరాన్ని అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. అదేవిధంగా ఏప్రిల్ 1 నుండి స్థానిక సంస్థల ద్వారా ప్రజలు చెల్లిస్తున్న వివిధ రకాల పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆయా స్థానిక సంస్థల అభివృద్ధికే కేటాయిస్తామన్నారు. అందుకోసం ఇప్పటికే ప్రభుత్వ ఉత్వరులు జారీ అయ్యాయన్నారు. ఇందుకు కృషి చేసిన ముఖ్యమంత్రికి రాష్ట్ర ప్రజల తరపున ధన్యవాదాలన్నారు. అదేవిధంగా గత వారంలో నగరంలోని మూడు పార్కుల్లో జిమ్ ఎక్విప్మెంట్ ఏర్పాటు చేసేందుకు శంకుస్థాపన చేసామని, దీనికి నెల రోజులు గడువుండగా 15 రోజుల్లోనే పూర్తి చేసిన నగరపాలక సంస్థ అధికారులకు తన అభినందనలన్నారు. అదేవిధంగా సంతపేటలోని గుంటబడి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 3.5 ఎకరాల విస్తీర్ణంలో నిరుపయోగంగా ఉన్న స్థలాన్ని ఆట స్థలంగా మార్చి, బాస్కెట్ బాల్, ఫుట్ బాల్ కోర్టుల ఏర్పాటుకు, చుట్టూ 200 మీటర్ల వాకింగ్ ట్రాక్ ను ఏర్పాటు చేసేందుకు భూమి పూజ చేశామన్నారు. రాబోయే రోజుల్లో హడ్కో నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ని పూర్తి చేసి నెల్లూరును దోమల్లేని నగరంగా తీర్చిదిద్దేందుకు, అలాగే ప్రతి ఇంటికి మంచినీటిని అందించే కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి వెంట డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, అడిషనల్ కమిషనర్ నందన్, డీఈవో బాలాజీరావు, కార్పొరేటర్లు, తదితరులు ఉన్నారు.





# విద్యతోనే దేశాభివృద్ధి

*(మొదటి పేజీ తరువాయి)*



ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. చదివే విద్యార్థుల భవిష్యత్తు కోసం కృషి చేస్తున్న కరస్పాండెంట్, హెచ్ఎం, ఉపాధ్యాయ సిబ్బందిలను కొనియాడారు. ఇంకా ఉన్నత శిఖరాలను అవరోధించాలని కోరారు. అలాగే ఆత్మకూరు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వర్‌రెడ్డి, ఆత్మకూరు ఎంపీపీ కేత వేణుగోపాల రెడ్డి, అపూస్మ స్టేట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నేతాజీ సుబ్బారెడ్డి, పలువురు వక్తలు విద్యార్థులకు సూచనలు ఇస్తూ ప్రసంగించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారిని శాలువాలు కప్పి బొకేలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ వార్షికోత్సవ వేడుకల్లో పాఠశాల విద్యార్థిని విద్యార్థులు వివిధ రకాల పాటలకు నిత్య ప్రదర్శన చేశారు. పాటలే కాకుండా పౌరాణిక పాత్రలైన దుర్యోధనుడు, అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయములు చేశారు. పాఠశాల జీవిత చరిత్రను బుర్రకథ రూపంలో విద్యార్థులు ప్రదర్శించారు. చిన్న పిల్లలు వివిధ రకాల రైమ్స్ పాటలతో నృత్య ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో స్టేట్ ఈసీ మెంబర్ గోలి ప్రభాకర్, నెల్లూరు డిస్టిక్ సెక్రటరీ ఎస్.రామ్మోహన్ రెడ్డి, ట్రెజరర్ కృష్ణారావు, కరస్పాండెంట్స్ అభిషేక్ రెడ్డి, ఎస్.రామ్మోహన్ రెడ్డి, ఆత్మకూరు అపస్మా ప్రెసిడెంట్ కోటేశ్వర్‌రెడ్డి, సెక్రటరీ మల్లికార్జున నాయుడు, ట్రెజరర్ వెంకటేశ్వర్‌రెడ్డి, మేధా స్కూల్ కరస్పాండెంట్ టిసి వెంకటసుబ్బయ్య, సంగం వికాస్ స్కూల్ కరస్పాండెంట్ హరినాథ్ రెడ్డి, శ్రీ భారతి స్కూల్ కరస్పాండెంట్ ఎం.రమేష్, వికాస్ ప్రైమరీ స్కూల్ కరస్పాండెంట్ శ్రీకాంత్ రెడ్డి, అనంతసాగరం వికాస్ స్కూల్ కరస్పాండెంట్ ఎస్.కె. ఖాజావలి, పాఠశాల డైరెక్టర్ కె.దొరస్వామి రెడ్డి, కరస్పాండెంట్ సిహెచ్ వెంకటరమణారెడ్డి, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.






## బీదా రవిచంద్ర కుమారుని వివాహానికి హాజరైన ముఖ్యమంత్రి

*(మొదటి పేజీ తరువాయి)*

వంశీకృష్ణ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం బీదా రవిచంద్ర కుమారుడు గోకుల్ రిష్వెంత్ వివాహ కార్యక్రమానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ముఖ్యమంత్రి 2.18 గంటలకు కనుపర్తిపాడు హెలి పాడ్ నుండి బయలుదేరి ఉండవల్లి వెళ్లారు. వీడ్కోలు పలికిన వారిలో మునిసిపల్ మంత్రి నారాయణ, ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి, బీదా మస్తాన్‌రావు, ఎంఎల్‌ఏ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయ కర్త పెందుర్తి వెంకటేష్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు వీడ్కోలు పలికారు.

## పది విద్యార్థులకు ప్రతిభ పరీక్ష




**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్) ఆధ్వర్యంలో ఇందుకూరు పేట గ్రామంలో గల గవర్నమెంట్ హైస్కూల్లో 10వ తరగతి విద్యార్థులకు ప్రతిభ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు ఇందుకూరుపేట మండలంలో ఉన్న 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా టిడిపి మండల అధ్యక్షులు రావేళ్ల వీరేంద్ర నాయుడు విచ్చేశారు. యూనియన్‌లో ఉన్న అందరు కలిసి వీరేంద్ర నాయుడుని గౌరవంగా సత్కరించారు. కార్యక్రమంలో మైపాడు టీడీపీ నాయకులు లెనిన్,యూత్ లీడర్ దొడ్ల మల్లికార్జున, సూరి సుధీర్ మరియు స్కూల్ స్టాఫ్ పాల్గొన్నారు.

## గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు



**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని పల్లిపాడు గ్రామంలో ఉన్న పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. కార్యక్రమంలో తొలుత కమిటీ సభ్యులు గంపల.మంజుల మహాత్మా గాంధీ విగ్రహానికి ఖాదీ వస్త్రం, నూలమాల సమర్పించారు. అదేవిధంగా పొనక.కనకమ్మ విగ్రహానికి పట్టు వస్త్రం, నూలుమాల సమర్పించారు. అనంతరం కొత్తూరు బయాలజీ ఉపాధ్యాయులు పివి శేషయ్య పిల్లలందరికీ మహాత్మా గాంధీ యొక్క జీవిత విశేషాలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ మనోజ్, స్కూల్ విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ పరిధిలో బీసీ, కాపు, ఈబీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మురళి తెలిపారు. 10:30 గంటలకు నగర పంచాయతీ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు లబ్ధిదారులు హాజరు కావాలని ఆమె పేర్కొన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే లబ్ధిదారులు అవసరమైన సర్టిఫికెట్లను తీసుకురావాలని తెలిపారు.

# సర్వేపల్లిలో టీడీపీలోకి కొనసాగుతున్న చేరికలు

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** వైసీపీని వీడి టీడీపీలో చేరిన తోటపల్లి గూడూరు మండలం పేడూరు ఉప సర్పంచ్ సంగారు సుజన, శివయ్య, దినేష్, రాజేశ్వరమ్మ, తదితర 70 కుటుంబాలు సోమిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, గూడూరు నారాయణ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆత్మీయ ఆహ్వానం పలికారు. గత సార్వత్రిక ఎన్నికల్లో సోమిరెడ్డికి 450 ఓట్ల మెజార్టీ ఇచ్చిన పేడూరు పంచాయతీలో టీడీపీ మరింత బలోపేతం అవుతుందన్నారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ.. ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తూ సర్వేపల్లి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసుకుంటున్నామని, నిన్న చెముడుగుంట సర్పంచ్, వార్డు సభ్యులతోపాటు కీలక నాయకులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈరోజు పేడూరు ఉప సర్పంచ్‌తో కలిసి 70 కుటుంబాలు చేరి వైసీపీని ఖాళీ చేశాయన్నారు. నాకు సొంతూరుతో సమానమైన పేడూరు అభివృద్ధిలో తెలుగుదేశం పార్టీది ప్రత్యేక ముద్ర. గతంలోనే పేడూరు - చింతోపుల మధ్య తారు రోడ్డు నిర్మించామని, ఈ రోడ్డుతో రైతుల రాకపోకలకు మార్గం సుగమం కావడంతోపాటు భూముల విలువ భారీగా పెరిగిందన్నారు. కృష్ణారెడ్డిపాళెం నుంచి మాచర్లవారి పాళేనికి గతంలోనే రోడ్డు మంజూరు చేయగా వైసీపీ ప్రభుత్వంలో పక్కన పెట్టేశారు. ఆ రోడ్డు పనులను కూడా చేపడతామని, పేడూరు పంచాయతీ పరిధిలో రూ.35 లక్షలతో సిమెంట్ రోడ్ల నిర్మాణంతో పాటు తాగునీటి పథకాల పనులు చేస్తున్నామని, వరిపొలాల్లో చేపట్టిన బీపీసీఎల్ పైపులైను పనులతో పంట ధ్వంసం



అవుతుండటంపై అభ్యంతరం తెలిపి పేడూరు రైతులకు అండగా నిలిచామన్నారు. ప్రస్తుతం పైపులైను పనులను ఆపడంతో పాటు బాధిత రైతులకు తమిళనాడులో పరిహారం ఇచ్చిన తరహాలోనే ఇక్కడ కూడా ఇవ్వాలని కోరామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే ఉపాధి, గౌరవం, రాణింపు తథ్యం

- దాతృత్వానికి చేకూర్చాలి సార్థకం
- అందరికీ ఆరోగ్యం, నాణ్యమైన విద్య సంకల్పం
- దాత గార్లపాటి సందేశం




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** సమాజంలో నాణ్యమైన విద్యతోనే ఉజ్వలభవిష్యత్తు, ఉద్యోగం, ఉపాధి, గౌరవం, రాణింపు, సేవాఅవకాశం తదితరాలు తప్పకుండా లభిస్తాయని, అన్నివర్గాలకు విద్య, వైద్యం, ఆరోగ్యం అందాలన్న లక్ష్యం, సంకల్పంతోనే తమవంతుగా తమ గార్లపాటి ఫౌండేషన్ ద్వారా ఆర్థిక చేయూతనిస్తున్నామని ఆత్మకూరు మాజీ ఉపమండలాధ్యక్షుడు, మాజీ ఎంపిటిసి మెంబర్, మాజీ సర్పంచ్, గార్లపాటి ఫౌండేషన్ డైరెక్టర్ గార్లపాటి వేణుగోపాల్‌నాయుడు పేర్కొన్నారు. ఫౌండేషన్ ద్వారా కోట్లాది రూపాయలతో విద్యార్థులకు ఉపకరణాలు, స్కాలర్‌షిప్‌లు, మౌళికవసతులు కల్పిస్తున్న కరటంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం రాత్రి పెద్దఎత్తున నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమంలో వేణుగోపాల్‌నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈసా మాలకొండరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు ఎం.పెంచలరెడ్డి పాఠశాల నివేదికను చదివి వినిపించారు. గార్లపాటి ఫౌండేషన్ డైరెక్టర్ గార్లపాటి వేణుగోపాల్ నాయుడు, ఆయన సోదరుడు, ల్యాంకో గ్రూప్ ఆఫ్‌కంపెనీస్ మేనేజింగ్ డైరెక్టర్, వైస్‌ఛైర్మెన్ గార్లపాటి భాస్కరనాయుడు, మరో సోదరుడు, ఫౌండేషన్ డైరెక్టర్ గార్లపాటి సుబ్బారావులు అనేక సామాజిక సేవాకార్యక్రమాలను తమ స్వంత నిధులు కోట్లాదిరూపాయలతో నిర్వహించారు. తమ స్వగ్రామమైన కరటంపాడులో హైస్కూల్లో దాదాపు 2.5కోట్ల రూపాయలు ఇప్పటివరకు వెచ్చించి అనేక మౌళికవసతులు, భవనాలు, విగ్రహాలు, మండపాలు ఏర్పాటు చేయడంతోపాటు ప్రతిఏటా విద్యార్థులందరికీ యూనిపారం దుస్తులు, లాంగ్‌నోటుపుస్తకాలు, టెన్త్‌లో 550మార్కులు సాధించే విద్యార్థులందరికీ కార్పోరేట్ విద్యకోసం 1లక్షరూపాయల వంతున స్కాలర్‌షిప్‌లు అందజేస్తుంటారు. గ్రామంలో అందరికీ స్వచ్ఛమైన తాగునీరందించాలని వాటర్‌ప్లాంటు ఏర్పాటు చేసి ఉచితంగా సరఫరాచేస్తున్నారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగ్గా ఉండాలాన్న లక్ష్యంగా పంచాయతీకి ఒక ట్రాక్టర్‌ను సమకూర్చారు. ప్రజలకు వైద్యసేవలందించేలా ఒక వాహనంద్వారా సిబ్బంది, మందులు ఏర్పాటుచేసి 11గ్రామాలకు వైద్యసేవలందిస్తుంటారు. వారి సేవలను కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్న వారంతా వివరించి కొనియాడి గార్లపాటి సోదరులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా గార్లపాట వేణుగోపాల్ నాయుడు ప్రసంగిస్తూ తాము అరాకొరా వసతులతో విద్య అభ్యశించామని, ఉన్నత విద్యపొంది స్థితిమంతులమయ్యామని, అందరికీ మెరుగైన విద్య అందాలన్న లక్ష్యంగా తమవంతుగా తమగ్రామంలోని పాఠశాలకు కోట్లాదిరూపాయలతో అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, తామందించే సాయంతో విద్యార్థులు ఉత్తమవిద్య అందుకొని ఉజ్వలభవిష్యత్తుపొందితే తమ సేవలకు సార్ధకత ఉంటుందని ఆయన పేర్కొన్నారు. టెన్త్‌లో 550మార్కులు సాధించిన వారందరికీ కార్పోరేట్ విద్యకోసం ఒక లక్ష రూపాయల వంతున తమ ట్రస్ట్ ద్వారా ఆర్థికసాయమందిస్తామని వేణుగోపాల్‌నాయుడు పేర్కొన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు అత్యంత శ్రద్ధతో చిత్తశుద్ధిగా బోధనగావిస్తున్నారని, విద్యార్థులు క్రమశిక్షణగా శ్రద్ధాసక్తులతో అభ్యశించాలని, మంచి మార్కులు సాధించాలని వేణుగోపాల్ నాయుడు కోరారు. ఈసందర్భంగా దాదాపు 60మంది విద్యార్థినీ, విద్యార్థులు అనేక సాంస్కృతిక ప్రదర్శనలివ్వగా అందరినీ ఆకట్టుకున్నాయి. కళామతల్లిసేవలో భాగంగా దాత వేణుగోపాల్‌నాయుడు, ఆయన సోదరుడు సుబ్బారావు, మాజీ సర్పంచ్ పఠాన్ సాబ్జాన్‌ఖాన్‌లు కూడా కళాప్రదర్శనలిచ్చారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతీప్రధానం గావించారు. అతిథులకు ఘనసన్మానాలు చేసి జ్ఞాపికలందజేశారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా సోమశిల ప్రాజెక్ట్‌కమిటీ వైస్‌ఛైర్మెన్ పూనుగుంట ధనుంజయ, కరటంపాడు, ఆరవేడు, బి.చిరువెళ్ళ సర్పంచ్‌లు పూనుగుంట రేవతి, సూరం ప్రసాద్‌రెడ్డి, బొలిగర్ల వెంకటేశ్వర్లు, ఉదయగిరి ఎంయివో తోట శ్రీనివాసులు, విద్యాకమిటి ఛైర్మెన్ గౌస్, మాజీ ఛైర్మెన్ బాబూరావు, మాజీ సర్పంచ్ సాబ్జాన్‌ఖాన్, మాజీ ఉపసర్పంచ్ హనీఫ్, వివిద పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, బి.చిరువెళ్ళ మాజీ సర్పంచ్ రావూరు రత్నాకర్‌రెడ్డి, రిటైర్డ్ విఆర్వో ఎం.వి.శేషగిరిరావు, బి.చిరువెళ్ళ ప్రముఖుడు మంతు శ్రీనివాసులురెడ్డి తదితరులు ప్రసంగించి గార్లపాటి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు, కళాకారుడు, మేకప్‌మెన్, రచయిత పి.చాంద్‌బాషా, డ్యాన్స్‌మాస్టర్ దేవరపాటి మాధవ్, పాఠశాల ఉపాద్యాయులు ఎం.పెంచలరెడ్డి, ఎస్.కెనూర్జహాన్, ఎం.సత్యవతి, డి.ప్రతాప్‌చక్రవర్తి, పి.మణి, డి.మాధవి, పి.విజయశ్రీ, పి.శైలజ, పి.రజనీప్రియ, వి.పద్మమ్మ, పి.హరికృష్ణ, ఎస్.మోహన్‌రావు, ఎస్.విరత్నం, జి.తిరుమలరెడ్డి, మల్లికార్జున్, స్నేహకుమార్, సురేష్, ఆర్.మాలకొండయ్య, బోధనేతర సిబ్బంది ప్రసాద్, నాయబ్, రవికుమార్, రాజ్యలక్ష్మి, రాజేశ్వరి, అబ్దుల్‌ఖాదర్, విద్యార్థినీ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.







# సీఎం చంద్రబాబు పర్యటన దృశ్యాలు



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు నెల్లూరులో ఘన స్వాగతం లభించింది. ఆయన మధ్యాహ్నం నెల్లూరు రూరల్ మండలం కనుపర్తిపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ లో ఏర్పాటు చేసిన హెలిపాడ్ కు చేరుకున్నారు. అనంతరం బీదా రవిచంద్ర కుమారుడు గోకుల్ రిష్వెంత్ వివాహ కార్యక్రమానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.





































# 25 నుంచి మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని చోళులు కాలం నాటి పురాతన శివాలయంలో 25వ తేది నుంచి వచ్చేనెల 2వ తేది వరకు శ్రీ కామాక్షి తాయి సమేత రామలింగేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు పీబీఎస్వీ ప్రసాద్ రావు, ఈఓ ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆదివార స్థానిక శివాలయంలో ప్రసాద్‌స్వామి మాట్లాడుతూ.. 25వ తేదీ మంగళవారం సాయంత్రం అంకురారోహణ, రాత్రి ధ్వజారోహణ రావణ సేవ కార్యక్రమాలు ఉంటాయని, వీటికి ఉభయ కర్తలుగా కోడూరు శ్రీనివాసులు, దేవాంగ సంఘం వారు వ్యవహరిస్తారు. 26వ తేది బుధవారం రాత్రి మహాశివరాత్రి పురస్కరించుకొని లింగోద్భవ కాలంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, నందిసేవ ఉంటుందని, ఉభయ కర్త రైతు సంఘం వారు వ్యవహరిస్తారు. 27వ తేది గురువారం గిన్నె బిక్ష కార్యక్రమానికి సీసీఆర్ ప్రసాద్ ఏ.కృష్ణమూర్తి, ఎం.రాజశేఖర్, ప్రసాద్ రావు వ్యవహరిస్తారు. 28వ తేదీన ఉదయం కళ్యాణం, పొదలకూరు ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో జరుగుతుంది. అనంతరం గజ వాహనంపై ఊరేగింపు ఉంటుంది. మార్చి 1వ తేదీ అలకల తోపు, చిట్టేపల్లి గ్రామస్థులు, 2వ తేది ఉదయం ధ్వజావరోహణ రాత్రి ఏకాంత సేవ జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమానికి ఉపయకర్తలుగా పడవల సుబ్రహ్మణ్యం, రవికుమార్, తరుగు వెంకటేశ్వర్లు, శీను, నాగరాజన్, తరుగు ప్రభాకర్ లక్ష్మీనారాయణ వ్యవహరిస్తారు. మహాశివరాత్రి రోజున అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తుల కొంగుబంగారంగా విరాజుల్లుతున్న శ్రీ విఘ్నేశ్వర, శివాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలకు విశేష ప్రాధాన్యం ఉన్నదని పొదలకూరు మండలం నుంచే కాకా చుట్టుపక్కల మండలాల నుంచి ఇతర జిల్లాలనుంచి కూడా భక్తులు స్వామివారిని దర్శించుకుంటారన్నారు. అలాగే ధ్వజారోహణ, ధ్వజావరోహణ సమయాల్లో సంతానం లేని వారికి కొడి ముద్దలు పంచుతారని, అవి తిన్నవారికి సంతాన ప్రాప్తి కలుగుతుందన్నారు. పై కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు.

# ప్రకృతి వైద్యం ఆరోగ్యానికి మేలు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ప్రకృతి వైద్యం ఆరోగ్యానికి మేలు అని ప్రకృతి సేవా ఫౌండేషన్ తెలిపింది. ఆదివారం మామిడిపూడి గ్రామంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యాచురోపతి, ఆయుర్వేద ఉచిత వైద్య శిబిరం ఏర్పాటయింది. ప్రకృతి సేవా ఫౌండేషన్ ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ వెంకట గిరీష్ కుమార్ మాట్లాడారు. ప్రకృతి ఇచ్చినటువంటి ఆహారాన్ని తీసుకోకుండా అందుకు విరుద్ధంగా ఆహారం తీసుకోవడం వల్ల అనారోగ్యం తెచ్చుకుంటూ ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఉచిత న్యాచురోపతి, ఆయుర్వేద ఉచిత వైద్య శిబిరంలో వైద్య పరీక్షలను ఉచితంగా చేసి మందులను 50 శాతం డిస్కౌంట్ తో రోగులకు ఇవ్వడం జరిగింది. సుమారు 50 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు అహ్మద్ బాషా, షూకూర్, మీరాముద్దీన్, రహీం, తుంగ ఏడుకొండలు, బూదురు సునీత తదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మదేవం శివాలయం శివరాత్రి మహోత్సవాలకు ముస్తాబు

## ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ అధికారులు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని బ్రహ్మదేవం గ్రామంలో వెలసి ఉన్న కామాక్షి తాయి సమేత కైలాస నాధేశ్వర స్వామి ఆలయంలో బుధవారం మహా శివరాత్రి మహోత్సవాలు ఒకరోజు మాత్రమే జరగనున్నాయి. ఈ కార్యక్రమాలకు తగిన ఏర్పాట్లను ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎం.మోహన్ కుమార్ సిద్ధం చేసుకుని ఉన్నారు. ఆలయ వంశపారపర్య ధర్మకర్త కొత్తపల్లి రమేష్ కుమార్ శర్మ సహకారంతో ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రాతకాలం మూడు గంటల నుండి కామాక్షి తాయి సమేత కైలాస నాదేశ్వర స్వామి, అదేవిధంగా కామాక్షి తాయివార్లకు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పులకాపు, శ్రీ సూక్త పూర్వక శ్రీ కళాశాభిషేకమం నిర్వహిస్తారు. ఆనవాయితీగా వస్తున్న పద్ధతిని అమలు చేస్తూ కొత్తపల్లి కుటుంబ సభ్యులు కొత్తపల్లి శ్రీనివాసులు జ్ఞాపకార్ధంగా ఉభయ కర్తలుగా వ్యవహరిస్తూ కామాక్షి తాయి అమ్మవార్లకు, కైలాస నాదేశ్వరస్వామి వార్లకు చందనాలంకార మహోత్సవాన్ని ఘనంగా చేస్తారు. పూలంగి సేవ, మహా నివేదన, మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగంతోపాటు అర్చనలు సర్వదర్శనం లాంటి కార్యక్రమాలు జరుగుతాయి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కామాక్షితాయి సమేత కైలాస నాదేశ్వర స్వామి వార్లకు కళ్యాణం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలగా దువ్వూరు హరిప్రసాద్ రెడ్డి కుటుంబ సభ్యులు వ్యవహరిస్తారు. సత్యసాయి భక్తబృందం వారిచే భజన కార్యక్రమాలు చేస్తారు. మాజీ ఎంపీపీ కీర్తిశేషులు మెట్టా చంద్రశేఖర్‌రెడ్డి జ్ఞాపకార్థంగా ఆయన తనయుడు మెట్టా విష్ణు వర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులు భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి అన్నదానం కార్యక్రమం జరుగుతుంది. సాయంకాలం అర్చనలు, సర్వదర్శనం, బిల్వార్చన, దేవి ఖడ్గమాల, మహా నివేదన, మంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం, లింగోద్భవకాల సందర్భంగా విశేష పూజలు జరగనున్నాయి. అదేవిధంగా సరిగమ ఆర్కెస్ట్రా అండ్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో పాటకచేరి జరుగుతుంది. మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, కీలుగుర్రాలు మధ్య బాణాసంచా పేలుళ్లతో నంది సేవ గ్రామో త్సవాన్ని ఘనంగా చేయనున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలను ఆలయ వంశపార పర్య ధర్మకర్త కొత్త రమేష్ కుమార్ శర్మ నిర్వర్తి స్తారు. ఆలయంలో ప్రసాద వినియోగం ఉభయ కర్తలగా కొత్తపల్లి రమేష్ కుమార్, కొత్తపల్లి మధుసూదన్ శాస్త్రి, కొత్తపల్లి సురేష్ శర్మ, కొత్త పల్లి సాయి వెంకట సుబ్రహ్మణ్యం, కొత్తపల్లి మురళీకృష్ణ, కొత్తపల్లి మహేష్ కుమార్ లుగాఉన్నారు.

# లైబ్రేరియన్‌లేని ఆత్మకూరు గ్రంధాలయం

● 15 సంవత్సరాలుగా ఇన్‌చార్జ్‌తోనే

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని జిల్లా గ్రంధాలయసంస్థ శాఖా గ్రంధాలయం ఒకటిన్నర దశాబ్దకాలంగా లైబ్రేరియన్ లేకుండానే ఇన్‌చార్జ్‌తోనే కొనసాగిస్తున్నారు. 2009లో ఇక్కడ లైబ్రేరియన్‌గా పని చేస్తున్న ఏ.గోవిందరెడ్డి రిటైర్ అయ్యారు. నాటి నుండి ఓంకారం శ్రీనివాసరాజు అనే లైబ్రేరియన్ మర్రిపాడు, సంగం, ఏఎస్‌పేటల్లో రెగ్యులర్ లైబ్రేరియన్‌గా, ఆత్మకూరు గ్రంధాలయ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. రెవిన్యూ డివిజన్ కేంద్రం, నియోజకవర్గకేంద్రం, వివిద శాఖల డివిజన్ కేంద్రంగా, మండల కేంద్రంగా కొనసాగుతున్న ఆత్మకూరులో గ్రంధాలయానికి గ్రంధబాంధాగారి లేకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంగా ఉంది. దశాబ్దాలతరబడి ఆత్మకూరు గ్రంధాలయానికి స్వంత భవనం లేకుండా అద్దెభవనం కొనసాగుతుండగా నాలుగేళ్ళక్రితం స్థానిక ఇందిరాగాంధీ మహిళామండలి భవనాన్ని ఆభవ నిర్వాహకులు గ్రంధాలయానికి అప్పగించారు. అయితే లైబ్రేరియన్ మాత్రం ఇన్‌చార్జ్‌గా శ్రీనివాసరాజును కొనసాగిస్తున్నారు. శ్రీనివాసరాజు విధుల నిర్వహణలో అత్యంత చిత్తశుద్ధిగా వ్యవహరిస్తుంటారు. కానీ ఆయనను ఆత్మకూరుకు బదిలీచేయాలని పలువురు కోరుతుండగా ఆత్మకూరు గ్రంధాలయం బిక్యాటగిరిలో ఉందంటున్నారు. డివిజన్‌కేంద్రంగా అనేక కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రవేటుపరంగా దాదాపు 30 విద్యాసంస్థలు, అదీగాక ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఐటిఐ, గురుకుల తదితర ప్రత్యేక విద్యాసంస్థలుండగా ఆత్మకూరు గ్రంధాలయాన్ని ఏ క్యాటగిరిగా మార్చకపోవడం విశేషం. అదీగాక ఆత్మకూరు గ్రంధాలయంలో వేలకొద్ది అన్ని రకాలు పుస్తకాలున్నాయి. అన్నివర్గాలకు అవసరమైన అన్ని పుస్తకాలున్నాయి. జిల్లాలో దాదాపు 50శాతం లైబ్రేరియన్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా అటు ప్రభుత్వం, ఇటు జిల్లా గ్రంధాలయసంస్థ లేదా ప్రజాప్రతినిధులు దృష్టి సారించి ఆత్మకూరు గ్రంధాలయాన్ని ఏగ్రేడ్‌గా మార్చాలని, రెగ్యులర్ లైబ్రేరియన్‌ను నియమించేలా చర్యలు తీసుకోవాలని సర్వత్రా కోరుతున్నారు.

# అభయాంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్సీ పూజలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు-ముంబాయి రహదారిపై ఆత్మకూరు పట్టణ శివార్లలోని బైపాస్‌రోడ్డు జంక్షన్‌లోని శ్రీశ్రీశ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం శాసనమండలి సభ్యులు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ప్రత్యేకంగా పూజలు చేశారు. ఏఎస్‌పేటలో ఒక కార్యక్రమానికి వెళుతూ చంద్రశేఖర్‌రెడ్డి అభయాంజనేయ స్వామి ఆలయంకు విచ్చేశారు. ఆలయకమిటీ చైర్మెన్ ఏటూరు సుధాకర్‌రెడ్డి స్వామి ఎమ్మెల్సీకి స్వాగతం పలుకగా అర్చకులు కృష్ణమూర్తిస్వామి పూర్ణకుంభంతో స్వాగతించారు. స్వామివారికి ప్రత్యేకపూజలు, అర్చనలు చేసిన అనంతరం చంద్రశేఖర్‌రెడ్డి స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నేతాజిస్కూల్ కరస్పాండెంట్, అపుస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వి.సుబ్బారెడ్డి, అపుస్మా జిల్లా ఉపాధ్యాక్షుడు, స్తానిక ప్రగతిస్కూల్ కరస్పాండెంట్ ఎస్.రామ్మోహన్‌రెడ్డి, పట్టణ వైసిపి నాయకుడు ముజీబుల్లా తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీ నూతన కమిటీ ఎంపిక

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరం మూలపేట మండలం బీజేపీ కమిటీ ఎంపిక మూలపేటలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ విడతల రమేష్ పాల్గొన్నారు. 39, 40, 41, 42, 43, 44 వార్డులలో బీజేపీని బలోపేతం చేసేందుకు చర్చించారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు ఆరు మంది ఉపాధ్యక్షులను కందికట్టు రాజేశ్వరి శాలువాలతో సన్మానించారు.



ఐదు మంది కార్యదర్శులను మహిళా మోర్చా నేత నాగలక్ష్మి సన్మానించారు. ఇద్దరు ప్రధాన కార్యదర్శులను యువ మోర్చా జనరల్ సెక్రటరీ నరేష్ సన్మానించారు.

## శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంకు వాటర్ బాటిళ్ల విరాళం



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం మహాశివరాత్రి సందర్భంగా చెన్నై కి చెందిన శ్రీ గజలక్ష్మి బాలయ్య 6000 వాటర్ బాటిల్స్ భక్తులకు పంపిణీ చేయవలసిందిగా శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అధికారులకు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.



**టీవీ విరాళం :** శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంకు నెల్లూరు జిల్లా పూడిపర్తి గ్రామ వాస్తవ్యులు సారంగం రామచంద్రయ్య. సారంగం ప్రమీల వారు శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానానికి సుమారు లక్ష రూపాయలు విలువచేసే 55 ఇంచులు ఎల్జి ఎల్ఈడి టీవీల్ని శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వణాధికారి టి.బాపిరెడ్డికి విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అధికారులు పాల్గొన్నారు.

## చింతల వారి పల్లిలో అగ్ని ప్రమాదం



**పుంగనూరు, మేజర్‌న్యూస్:** నియోజకవర్గ పరిధిలోని సోమల మండలం నెల్లి మంద పంచాయతీ చింతల వారి పల్లి గ్రామంలో శనివారం అగ్నిప్రమాదం జరిగింది అగ్ని ప్రమాదం జరుగుతున్న వార్త తెలియగానే ఫైర్ ఆఫీసు సుబ్బరాజు తమసిబ్బందితో కలిసి అక్కడ వెళ్లి మంటలు ఆర్పారు ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన బాల సుబ్రమణ్యం తండ్రి పి చంగల్ రాయప్ప కు చెందిన నివాస గృహాల మధ్య వరిగడ్డి వామి అగ్ని ప్రమాదానికి గురైంది, వరిగడ్డి వామిని నీటితో పూర్తిగా నిరోధించి చుట్టుపక్కల అగ్ని వ్యాపించకుండా నిరోధించడం జరిగిందన్నారు. అగ్ని ప్రమాదానికి కారణం ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడం వలన ప్రమాదం జరిగినట్లు యజమాన్యం తెలిపారని. ఈ అగ్ని ప్రమాదం నందు ఆస్తి నష్టం సుమారు 15,000 రూపాయలు వరకు ఉండొచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

## నాగదేవతకు విశేష పూజలు

**పుంగనూరు, మేజర్‌న్యూస్:** పట్టణంలోని పలమనేరు రోడ్ లో గల ఓం శక్తి ఆలయం దగ్గర ఆదినారాయణ రైస్ మిల్ పక్కన గల పురాతన నాగలకట్టకు సోమవారం విశేష పూజ కార్యక్రమాలు జరుగుతాయని హిందూ బంధువులందరూ అక్కడకు విచ్చేసి పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని బిజెపి నాయకులు కోరారు.



## సీఎం చంద్రబాబుకు ఎం సుబ్బయ్య స్వాగతం

**శ్రీకాళహస్తిఅర్బన్, మేజర్‌న్యూస్:** తిరుపతి పార్లమెంట్ ఎస్టీ సెల్ అధ్యక్షులు ఎం సుబ్బయ్య రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి తిరుపతిలో ఘన స్వాగతం పలికారు.

## నగరిలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సమావేశం



**నగరి, మేజర్ న్యూస్:** నేషనల్ చైర్మన్ సంపత్ కుమార్ ఆదేశాల మేరకు సౌత్ జోన్ చైర్మన్ భాస్కర్ ఆధ్వర్యంలో నగరిలో జరిగిన సమావేశం కు ముఖ్య అతిథిగా నేషనల్ చీఫ్ సెక్రటరీ బుల్లెట్ రవి పాల్గొన్నారు తమిళనాడు చైర్మన్ మని,రాష్ట్ర ఉపాధ్యక్షులు పూర్ణ చంద్రారెడ్డి జిల్లా కన్వీనర్ రమణ మరియు జిల్లా మీడియా సేకరెట్రి ఎల్.కోదండరామన్ నగరి సౌత్ జోన్ నాయకులతో మార్చి 09న తిరుపతి లో జరుగు మూడవ వార్షికోత్సవం గురించి చర్చించడం జరిగింది.

## ఇండ్ల వద్ద చెత్త సేకరిస్తున్న పంచాయతీ



**కార్వేటినగరం మేజర్‌న్యూస్:** కార్వేటినగరం మేజర్ పంచాయతీలో ప్రతి వీధికి వెళ్లి ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించి న చెత్తను చెత్త నుండి సంపద తయారీ కేంద్రానికి తీసుకువెళ్లి పొడి చెత్త తడి చెత్త వేరు చేసి వర్మి కంపోస్టు తయారు చేసి రైతులకు ఎరువు విక్రయిస్తారని పంచాయతీ కార్యదర్శి ఇన్చార్జి కార్యదర్శి ఇంచార్జ్ ఓపిఆర్డి నాగరత్నమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ధనంజయవర్మ హరిత రాయబారులు పాల్గొన్నారు.

## వీరభద్ర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే సీ కే బాబు

**చిత్తూరు అర్బన్, మేజర్ న్యూస్:** రజక కులస్థుల ఆరాధ్య దైవం శ్రీ వీరభద్ర స్వామికి మాజీ ఎమ్మెల్యే సీకే బాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా రజక కులస్తులు తమ ఆరాధ్య దైవం శ్రీ వీరభద్ర స్వామికి మైలారు పండుగ సందర్భంగా నగరంలోని స్థానిక మిట్టూరు నందు గల గంగినేని చెరువు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితి, ఇందులో భాగంగా ఆదివారం మాజీ ఎమ్మెల్యే సీకే బాబు ఈ కార్యక్రమంలో పాల్గొని శ్రీ వీరభద్ర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సురేష్, వెంకటేష్, కుట్టి, సూరి, శ్రీనివాసులు, సునీల్, వినోద్, వినాయకం, సుబ్రమణ్యం పాల్గొన్నారు.





## దేశాభివృద్ధికి ప్రధాని మోదీ కృషి : బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి పట్టణం శ్రీరామ్ నగర్ కాలనీ 109 పోలింగ్ బూత్ శక్తి కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మన్‌కి బాత్ మనసులో మాట కార్యక్రమాన్ని పోలింగ్ బూత్ అధ్యక్షురాలు ప్రియాంక తమ నివాసంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుపతి బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు డాక్టర్ చంద్రప్ప విచ్చేసి వార్డు ప్రజలు, బిజెపి కార్యకర్తలతో కలిసి దూరదర్శన్ లో ప్రసారమయ్యే మన్ కీ బాత్ 119వ ప్రత్యక్ష ప్రసారా కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రప్ప మాట్లాడుతూ మన ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీ దేశాన్ని ప్రపంచంలోనే నెంబర్వన్ గా తీసుకువెళ్లాలి అనే ఉద్దేశంతో వికసిత్ భారత్ అనే కార్యక్రమంలో చేస్తున్నటువంటి అనేక కార్యక్రమాలలో మన్ కీ బాత్ ప్రధానమంత్రి మనసులో మాట ఇప్పుడు 119వ ఎపిసోడ్ గా జరుగుతున్నది వారు క్రమం తప్పకుండా అనేక విషయాల్ని తెలియజేస్తున్నారని ఈరోజు ప్రత్యేకమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా అనేక రకాలైనటువంటి సేవా కార్యక్రమాలను పొందవచ్చని తెలియజేస్తున్నారు. దాంట్లో ప్రముఖంగా ఆదిలాబాద్ లో ఉన్నటువంటి ఒక టీచరు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి లిపిలేని భాషల్లో లిపిని తయారు చేయడం అనే కార్యక్రమాన్ని తీసుకొస్తున్నారు. భారతదేశంలో మహిళలను గౌరవించడం మన సాంప్రదాయం మహిళలకు అత్యంత ప్రాధాన్యత నిచ్చి మహిళసాధికారత ఎప్పుడైతే ఉంటుందో ఈ దేశం అభివృద్ధి దిశగా వెళుతుంది అని మార్చి 8వ తేదీ రాబోయే మహిళా దినోత్సవాన్ని ఒక పండుగలాగా జరుపుకోవాలని. జాతీయ క్రీడలు చత్తీస్ ఘడ్ డెహ్రాడూన్ లో ఓపెన్ చేసినప్పుడు నరేంద్ర మోడీ పాల్గొని అనేక సూచనలు చేసి అక్కడ జాతీయ క్రీడల్లో మూడు నేషనల్ రికార్డ్స్ కొత్తవి క్రియేట్ చేయడం యువత అనేక విధాలుగా అనేక రంగాలలో ముందుకు రావడం జాతీయ క్రీడల్లో ఏడవ స్థానాన్ని పొందడం హర్షించదగ్గ విషయమని తెలిపారు.

## బ్యాంక్ ఆఫ్ బరోడా సేవా కేంద్రం ప్రారంభం



**పుంగనూరు, మేజర్‌న్యూస్:** పట్టణంలోని ఎంబిటి రోడ్డు నందు బ్యాంక్ ఆఫ్ బరోడా ఎదురుగా వినియోగదారుల సేవా కేంద్రాన్ని ఆదివారం ఎక్స్ సర్వీస్ మెన్ బడాల సుబ్రమణ్యం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు బ్యాంక్ అకౌంట్, గోల్డ్ లోన్ పర్సనల్ లోన్, బిజినెస్ లోన్లనుతమ సేవ కేంద్రం ద్వారా ఖాతాదారులకు సేవలందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ సర్వీస్ మెన్, విశ్రాంత డిఎస్పి సుకుమార్ బాబు మాట్లాడుతూ 18-70 సంవత్సరాలోపల గలవారు ప్రతి సంవత్సరం రూ.20లు తమ అకౌంట్ నుండి ఇన్సూరెన్స్ కడితే ఏదైనా ప్రమాదం జరిగి మరణించిన, సహజ మరణం చెందిన నామినీకి రెండు లక్షల రూపాయలు ఇన్సూరెన్స్ అమౌంట్ వస్తుందన్నారు. అలాగే 50 సంవత్సరాలు లోపల వారు 432 తమ అకౌంట్ నుండి ఇన్సూరెన్స్ అమౌంట్‌గా కడితే రెండు లక్షల వరకు ప్రమాదం జరిగి మరణించిన, సహజమరణమైన నామినికి అందజేస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క ఖాతాదారులు ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాగ రాజునాయక్ వేణుగోపాలు రాజారెడ్డి ఎస్వి బాబు హనుమంతప్ప సుధాకర్‌రెడ్డి హరి మొదలి నాగరాజరెడ్డి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

## కాణిపాకం ఆలయ ట్రస్టు బోర్డు చైర్మెన్ పదవి బీసీలకు కేటాయించాలి

**– కాణిపాకం మాజీ సర్పంచ్ గోపినాథన్ విజ్ఞప్తి**



**ఐరాల మేజర్‌న్యూస్:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం స్వయంభూ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి ఆలయ ట్రస్టు బోర్డు చైర్మెన్ పదవిని కాణిపాకం ఆలయ ఉభయదార్లు కమిటీలో వెనుకబడిన తరగతుల బి సి కులస్తులకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించాలని కాణిపాకం మాజీ సర్పంచ్, కాణిపాకం ఆలయ ఉభయ దార్లు కమిటీ ఉపాధ్యక్షులు రాష్ట్ర ప్రభుత్వం కు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి వర్యులు నారా లోకేష్ ముగ్గురు కలిసి రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్న సంగతి తెలిసిందే. అందు లో భాగంగానే కాణిపాకం స్వయంభూ శ్రీ వరసిద్ధివినాయక ఆల యంను పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ పర్య వేక్షణలో మాష్టర్ ప్లాన్ ద్వారా అంచులు అంచులుగా అభివృద్ధి చేస్తు న్నారు. కాణిపాకం స్వయంభూ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి ఆలయానికి ఇ 14 గ్రామాలో బిసి కులానికి చెందినవారు 65 శాతం మంది ఉన్నారు. ఇంతవరకు కాణిపాకం ఆలయ ట్రస్టు బోర్డు చైర్మెన్ పదవిని ఇప్పటి వరకు ఇవ్వలేదు. కాబట్టి ఈ ప్రభుత్వంలోనైనా బి సి కులానికి చెందిన ఉభయదార్లు కు కేటాయించాలని ఎమ్మెల్యే రాజకీయ పార్టీలకు అతీతంగా పైన తెలిపిన ముగ్గురు దయవుంచి ఆలయ ట్రస్టు బోర్డు చైర్మెన్ పదవి బిసి కులానికి ఇప్పించే దానికి ముఖ్య కారకులైన,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు బి సి కులానికి చెందిన సి ఆర్ రాజన్ వంటి వారు ప్రభుత్వం తీసుకొని వెళ్లి బిసి కులానికి చైర్మెన్ పదవి ఇప్పించాలని కాణిపాకం మాజీ సర్పంచ్, ఉభయ దారుల కమిటీ ఉపాధ్యక్షులు ఎల్ గోపీనాథన్ తోపాటు పలువురు బిసి ఉభయ దారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఘనంగా వెంకటేష్ యాదవ్ జన్మదిన వేడుకలు



**చిత్తూరు అర్బన్, మేజర్ న్యూస్:** రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి వెంకటేష్ యాదవ్ జన్మదిన వేడుకలు జిల్లా తెలుగు దేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం నగరంలోని స్థానిక జిల్లా టీడీపీ కార్యాలయం నందు రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి వెంకటేష్ యాదవ్ జన్మదిన వేడుకలు మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్,జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి జై చంద్రబాబు నాయుడు, చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ మెంబర్ విజయ్ కుమార్, జిల్లా వాణిజ్య విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి గోపాల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా భారీ కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు కొల్లు సుబ్బు, కొల్లు ఉపేంద్ర, యువరాజ్ నాయుడు, బాలు మురళి, మణికంఠ,ఏఎన్ బాబు, క్లస్టర్ ఇంచార్జ్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పూతలపట్టు నియోజకవర్గంలో పోటీ పరీక్షల కేంద్రాన్ని ఏర్పాటు చేయండి

**– రాష్ట్ర ముఖ్యమంత్రికి టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ వినతి**

**ఐరాల మేజర్‌న్యూస్:** రాష్ట్రంలో నిరుద్యోగుల కోసమని ఉద్యోగ ప్రకటనలు విడుదలవుతున్నాయి. కానీ పేద మధ్యతరగతి కుటుంబానికి చెందిన తెలివైన విద్యార్థులు, నిరుద్యోగులు, కోచింగ్ సెంటర్లకు వెళ్లి లక్షల ఐదు రూపాయలు చెల్లించి కోచింగ్ తీసుకోలేక, విలువైన మేధస్సు, తెలివితేటలు ఉన్నప్పటికీ కూడా ఉన్నప్పటికీ కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కావున వీళ్ళందరి కోసం పూతలపట్టు నియోజకవర్గంలో ఐరాల గాని బంగారు పాల్యం లేక తవణంపల్లిలో జిల్లా స్థాయి పోటీ పరీక్షల నిర్వహణ కేంద్రాన్ని, ఉచిత పోటీ పరీక్షల కోచింగ్ సెంటర్‌ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రిని రేణిగుంట ఎయిర్పోర్టో కలిసి విన్నవించడం జరిగింది. బ్యాంకింగ్, గ్రూప్ -1, గ్రూప్ -2, రైల్వే ఇతర పోటీ పరీక్షలకు తయారవ్వాలంటే గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిరుపేద, గ్రామీణ ప్రాంత విద్యార్థులు, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్,డిల్లి, కు వెళ్లి లక్షలాది రూపాయలు, డబ్బులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. కొందరు అప్పులు చేసి కోచింగ్లకు వెళ్లవలసిన పరిస్థితి ఉంది. కావున సామాన్య, మధ్యతరగతి, పేద, గ్రామీణ ప్రాంత విద్యార్థుల యొక్క సౌకర్యార్థం పూతలపట్టు నియోజకవర్గంలో జిల్లాస్థాయి పోటీ పరీక్షల కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు డాక్టర్ పి సప్తగిరి ప్రసాద్ రాష్ట్ర అధికార ప్రతినిధి తెలుగుదేశం పార్టీ తెలిపారు. నావిజ్ఞప్తిని సీఎం సానుకూలంగా స్పందించారని సప్తగిరి ప్రస్తాద్ తెలిపారు.

## సీఎం చంద్రబాబును కలిసిన రాష్ట్ర ప్రభుత్వ విప్



**కార్వేటినగరం మేజర్‌న్యూస్:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుపతి పర్యటన సందర్భంగా రేణిగుంట విమానాశ్రయం నందు ముఖ్య మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రభుత్వ విప్ మరియు గంగాధర నెల్లూరు శాసనసభ్యులు డాక్టర్ వి.యం థామస్ సన్మానించారు.

## బీసీలకు రాజ్యాధికారం కల్పించాలి



**తిరుపతి రూరల్, మేజర్‌న్యూస్:** 139 కులాలు పైగా ఉన్న బీసీలను రాజకీయంగా వాడుకుంటున్నారే తప్ప, ఆర్థికంగా రాజకీయంగా ఎదగనీయడం లేదని, బీసీలకు రాజ్యాధికారం కల్పించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లాక వెంగళరావు యాదవ్ అన్నారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీసీల రిజర్వేషన్లు పెంచాలని బీసీల సంక్షేమం కొరకు ప్రభుత్వాలు కృషి చేయాలని సూచించారు. అనంతరం జాతీయ బీసీ సంక్షేమ సంఘం పదవుల నియామకం ప్రకటించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులుగా రాజేష్ యాదవ్, జిల్లా జనరల్ సెక్రటరీగా రాజేష్ ఆచారి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షులుగా సావిత్రమ్మ, కార్యదర్శిగా విజయలక్ష్మి లను నియామకం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకులు వెంకట్రావు, శంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సంత్ గాడ్గే బాబా150 జయంతి



**చిత్తూరు, మేజర్‌న్యూస్:** గార్గే బాబా ఆదర్శనీయులని ఆయనను ఆదర్శంగా తీసుకొని నేటి యువత ముందుకు సాగాలని జాతీయ బిసి సంక్షేమ సంఘ దక్షిణాది రాష్ట్రాల ఇంచార్జ్ షణ్ముగం పేర్కొన్నారు. ఆదివారం గార్గే బాబా 150వ జయంతి వేడుకలను బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా షణ్ముగం మాట్లాడుతూ గాడ్గే బాబా భారతీయుడు, నిరక్షరాస్యుడు, సాధువు అని అన్నారు ఆయన సంఘసంస్కరణ, ఆధ్యాత్మిక చైతన్యం, స్వచ్ఛత ఉద్యమం, కుల నిర్మూలన, విద్యాదానం పోరాటం చేశారన్నారు. ముఖ్యంగా అట్టడుగు వర్గానికి చెందిన రజక కుటుంబంలో పుట్టిన ఒక సంఘసంస్కర్త అన్నారు.ఆయన జీవితంలో విద్య, ఆధ్యాత్మిక చైతన్యం, వాటితో పాటు కుల నిర్మూలన కోసం అనేక సంస్కరణలు చేపట్టిన ఒక మహోన్నతమైన వ్యక్తి సంత్ గాడ్గే బాబా అని అన్నారు.ఆ మహనీయులు అందరికీ ఆదర్శనీయులని ఆయనను స్ఫూర్తిగా తీసుకొని రజకులందరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షులు రవిరాజు, నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సిరిమా వెంకటేష్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు సి.వి.ప్రతాప్, వడ్డెర సంఘం నాయకులు హరి, రుద్రయ్య, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు సాయిరాం ఆచారి, రజక సంఘం నాయకులు, ఈశ్వర్, హరి ప్రసాద్, సూరిబాబు, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## నాటు సారా విక్రేత అరెస్టు : 20 లీటర్ల సారా స్వాధీనం



**చౌడేపల్లి రూరల్ మేజర్‌న్యూస్:** నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి అతని నుంచి 20 లీటర్ల నాటు సారాను స్వాధీన పరుచుకున్నట్లు ఎస్సై నాగేశ్వరరావు తెలిపారు. ఆయన కథనం మేరకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని దుర్గ సముద్రం పంచాయతీ చిన్నాగునపల్లిలో ఆదివారం ఉదయం కార్డెన్ సర్చ్ నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో అమాస నాగరాజా అనే వ్యక్తికి చెందిన నిర్మాణంలో ఉన్న ఇంటి వెనుక బంగి రాజప్ప నాటు సారా విగ్రహిస్తుండగా అతని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి అతని నుంచి సుమారు 20 లీటర్ల నాటు సారాను స్వాధీన పరుచుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగు దిగువపల్లి పంచాయతీ పక్షిరాజుపురంలో నాటు సారా కలిగిన వ్యక్తి పై కేసు నమోదు చేసి అతని నుంచి 40 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నాగేశ్వరరావు తెలిపారు ఆయన కథనం మేరకు... జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని దిగువపల్లి పంచాయతీ పక్షిరాజుపురంలో దాడులు నిర్వహించగా అదే గ్రామానికి చెందిన నక్కల అంజి పొలంలో ఉన్న వ్యవసాయ క్షేత్రంలో నాటు సారా తయారుచేసి అమ్మేందుకు సిద్ధంగా ఉంచినందున అతనిపై కేసు నమోదు చేసి 4 లీటర్ల నాటు సారాను స్వాధీన పరచుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు ఈ దాడుల్లో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## స్వచ్ఛ ఆంధ్ర దిశగా అడుగులు వేద్దాం



**చౌడేపల్లి రూరల్ మేజర్‌న్యూస్:** స్వచ్ఛ ఆంధ్ర దిశగా అడుగులు వేద్దామని ఈవో ఆర్ డి కృష్ణవేణి గారు అన్నారు ఆదివారం మండలంలోని దిగువపల్లి పంచాయతీ గ్రామాల్లో ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు మండల వ్యాప్తంగా అన్ని పంచాయితీలలోనూ ఈ కార్యక్రమం జరుగుతున్నట్లు ఆమె అన్నారు ప్రతి ఇంట చెత్త సేకరణ ద్వారా ఊరంతా పరిశుభ్రంగా ఉంటుందని తద్వారా ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు పరిసరాల పరిశుభ్రతతో అంటువ్యాధులకు దూరంగా ఉండవచ్చును అన్నారు ప్రతి ఒక్కరు స్వచ్ఛ ఆంధ్రకు సహకరించాలన్నారు ఈ కార్యక్రమంలో ఆయా పంచాయతీల కార్యదర్శి పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తీశ్వరుడు సేవలో మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జి

శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్: శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంకు మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జి దుప్పాల వెంకటరమణ ఆదివారం విచ్చేశారు. వారిని ప్రోటోకాల్ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి స్వాగతం పలికి శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామివారి ప్రత్యేక దర్శనం చేయించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు వేద పండితులు పాల్గొన్నారు.



# అసెంబ్లీ బడ్జెట్లో బీసీలకు సముచిత న్యాయం చేయండి

**- ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం నాయకుల రౌండ్ టేబుల్ సమావేశంలో బిసి సంక్షేమ సంఘం నేతల డిమాండ్**



**చిత్తూరు బ్యూరో, మేజర్‌న్యూస్:** నేటి నుండి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్రానికి సంబంధించి విడుదల చేయనున్న బడ్జెట్ నందు బీసీలకు సముచితమైన బడ్జెట్ ను కేటాయించి బీసీల అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహిళ ప్రధాన కార్యదర్శి సుగుణవతి దక్షిణాది రాష్ట్రాల ఇంచార్జ్ షణ్ముగం, రాష్ట్ర మహిళ ప్రధాన కార్యదర్శి హేమావతి లు కోరారు తిరుపతి నందు గల రెడ్డి భవన్ లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళ ప్రధాన కార్యదర్శి సుగుణవతి యాదవ్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు వై నాగేశ్వరరావు యాదవ్, రాష్ట్ర ఇంచార్జ్ మహిళా అధ్యక్షురాలు నూకాలమ్మ, జాతీయ సెక్రెటరీ జనరల్ ఆదిశేషు, దక్షిణాది రాష్ట్రాలు ఇంచార్జ్ పి. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షణ్ముగం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగన్నాథం, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి హేమవతిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రౌండ్ టేబుల్ సమావేశం నందు ముఖ్య అతిథులు మాట్లాడుతూ బిసి సంక్షేమ సంఘానికి సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా గ్రామ మండల నియోజకవర్గ పార్లమెంట్ కమిటీలు వెంటనే నియమించాలని తీర్మానించామని, నేటి నుండి జరుగు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో బీసీ వర్గాలకు బడ్జెట్ కేటాయింపుల్లో జనాభా తమషా ప్రకారం బడ్జెట్లో నిధులను కేటాయించాలని అలాగే 25 పార్లమెంటులలో బహిరంగ సభలు, మూడు ప్రాంతీయ మహాసభలు, ఏప్రిల్ చివరివారము లక్ష మందితో విజయవాడలో రాష్ట్ర మహాసభ నిర్వహించాలని తీర్మానించారు వీటితోపాటు సంక్షేమ వసతి గృహాలలో బీసీ విద్యార్థులకు డైట్ చార్జీలు పెంచాలని అలాగే వసతి గృహాలలో వసతులు కల్పనకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీ వర్గాలకు ప్రతి జిల్లాలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన బీసీ సంక్షేమ కమిటీలు ఏర్పాటు చేసి ప్రతి మూడు నెలలకు ఒకసారి కమిటీ సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు తెలంగాణ తరహాలో ఆంధ్ర రాష్ట్రంలో కూడా జనాభా లెక్కల సేకరణ సత్వరం చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశామని, త్వరలోనే రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం తరఫున ఒక ప్రతినిధి బృందం సీఎంని కలసి అపరిష్కృత సమస్యల పైన వినతిపత్రం సమర్పించాలని తీర్మానించి ఆ మేరకు డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు మరో సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో చిత్తూరు తిరుపతి జిల్లాల బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షులు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## కుప్పం ప్రజలకు అండగా ఉండండి.. పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలి

**- ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని కుప్పం పార్టీ శ్రేణులకు పుగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి పిలుపు**



**కుప్పం, మేజర్ న్యూస్:** కుప్పంలో వైసీపీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్క వైసీపీ నేత, కార్యకర్త కృషి చేయాలని పుంగనూరు ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి పిలుపునిచ్చినట్లు కుప్పం మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.అన్ని వర్గాలతో కలిసి ముందుకు సాగాలని.. పార్టీ గురించి భయపడాల్సిన అవసరం లేదని... ప్రతిపక్షంలో ఉన్నామని నిరాశ చెందవద్దని... మనకు 46 శాతం ఓటింగ్ వచ్చిందని అన్నారని తెలిపారు. కుప్పం ప్రజల సమస్యలపై పోరాటం చేయాలని పార్టీ శ్రేణులకు పెద్దిరెడ్డి సూచించారని తెలిపారు.కుప్పం ప్రజల తరపున పోరాటం చేయాలని... జగన్ ను మళ్లీ సీఎంను చేసుకోవాలని పిలుపునిచ్చారని తెలిపారు.

# కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో 24వ వార్షికోత్సవ వేడుకలు

**కుప్పం, మేజర్‌న్యూస్:** కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో 24 వ వార్షికోత్సవం (నాగాస్త్ర -2కె 25) ను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జబర్దస్త్ కామెడీ షో ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్న, తెలుగు సినిమా నటుడు, స్క్రిప్ట్ రైటర్, జబర్దస్త్ కమెడియన్స్ హైపర్ ఆది, ఆటో రాంప్రసాద్ లు ముఖ్య అతిథులుగా పాల్గొని కాలేజీ మ్యాగజైన్ ను ఆవిష్కరించారు.వీరు విద్యార్థులతో కలసి సినీ కామెడీ తో ను పంచ్ డైలాగ్స్ తోను అలరించారు. హైపర్ ఆది తనదయిన శైలిలో మాట్లాడుతూ ఇంతటి ఆహ్లాదకంమైన వాతావరణములోగల కుప్పం ఇంజనీరింగ్ కాలేజీలో విద్యను అభ్యసించడం విద్యార్థులు చేసుకొన్నా అదృష్టమని తెలిపారు. విద్యార్థులతో తన సినీ జీవిత విషయాలను పంచుకొన్నారు. బిసిఎన్ విద్యాసంస్థల అధినేత బి.సి నాగరాజ్ మాట్లాడుతూ దేశానికి అత్యుత్తమ నాణ్యత ప్రమాణాలతో కూడిన ప్రతిభావంతులయిన విద్యార్థులను తీర్చిదిద్దుతూ కుప్పం ఇంజనీరింగ్ కాలేజీ బోధన, పరిశోధనలలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంతరించుకొని ఈ రోజు 24 వ వార్షికోత్సవం జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల కూడలిలోని కుప్పం మారుమూల ప్రాంతం లో 2001 ప్రారంభించబడిన కుప్పం ఇంజనీరింగ్ కాలేజీ న్యాక్ ఏ గ్రేడ్ మరియు అటానమస్ హెూదాను సాధించి ఉన్నత విద్యారంగములో జాతీయ స్థాయిలో ఉత్తమ విద్యాసంస్థగా గుర్తింపును పొందిందని, విద్యార్థులు కళాశాల లోని వసతులను సద్వినియోగం చేసుకొని తమ నైపుణ్యాలను మెరుగు పరచుకొని మంచి భవిషతుకు ప్రణాళికలు వేసుకోవాలని సూచించారు. కళాశాల వైస్ చైర్మన్ డా .ఎన్.సునీల్ రాజ్ మాట్లాడుతూ విద్యారంగములో ఆధునిక సాంకేతికను గరిష్టంగా వినియోగిస్తూ చక్కటి మౌలిక సదుపాయాలతో అపారమయిన అనుభవం గడించిన అధ్యాపక బృందంతో పరిశ్రమల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ తదనుగుణముగా కుప్పం ఇంజనీరింగ్ కాలేజీ ముందడుగు వేస్తున్నదని,ప్లేసెమెంట్ ల విషయములోను ప్రపంచములోని అతిపెద్ద బహుళార్ధసాధక కంపెనీ(ఎమ్ ఎన్ సి) లలో ఆకర్షణీయమయిన ప్యాకేజీలను విద్యార్థులు అందుకునేలా తీర్చిదిద్దుతుంది అన్నారు .కుప్పం ఇంజనీరింగ్ కాలేజీ టాప్ రిక్రూటర్స్ లను ఆకర్షిస్తూ విద్యారంగానికి పరిపూర్ణతను అందిస్తూ బోధనలో 24 వ మైలురాయిని సాధించినందుకు ఆనందంగా ఉన్నదన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్. సుధాకరబాబు కళాశాల వార్షిక నివేదికను సమర్పించారు. ఈ సందర్భం గా కళాశాల లో బోధన, బోధనేతర రంగాలలో విశేష ప్రతిభకనబరచిన సిబ్బందిని విద్యాసంస్థల అధినేత బి.సి నాగరాజ్ ,చైర్ పర్సన్ ఎన్. శాంత నాగరాజ్ , వైస్ - ఛైర్మన్ డా.ఎన్. సునీల్ రాజ్ , సీఈఓ ఎన్. సాగర్ రాజ్ సన్మానించడం జరిగింది. అకాడమిక్ టాపర్స్ కు జబర్దస్త్ కమెడియన్ హైపర్ ఆది చేతుల మీదుగా నగదు పురస్కారం ఇవ్వడం జరిగింది. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం జరిగింది అనంతరం విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.






# క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే ఇంటూరి





**కందుకూరు, మేజర్‌న్యూస్ :** కందుకూరు ప్రీమియర్ క్రికెట్ టోర్నమెంట్‌ను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. ముందుగా బ్యాట్ పట్టి కాసేపు క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కందుకూరు పట్టణంలో క్రికెట్ క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా మైదానాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ముందుగా నిర్వాహకులు మస్తాన్, చిరంజీవి, రియాజ్, నాగరాజు క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభానికి విచ్చేసిన కందుకూరు ఎమ్మెల్యే నాగేశ్వరరావుకి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని, క్రీడల్లో ప్రతి ఒక్కరు గెలుపు ఓటమి సమానంగా తీసుకోవాలని పేర్కొన్నారు. క్రీడా కార్యక్రమాల నిర్వహణకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలియజేశారు. ఈ టోర్నమెంట్‌లో ఏటువంటి సమస్యలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో టోర్నమెంట్ విజయవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే తెలిపారు. క్రికెట్ టోర్నమెంట్‌లో మొదటి బహుమతిగా రూ.లక్ష, రెండో బహుమతి రూ.50వేలు విజేతలకి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాద్ గొంది నర్సింగరావు, షేక్ సలాం మరి ఇతర నాయకులు పాల్గొన్నారు.

# జిల్లాకు నీరు అందించి మీరు ఇచ్చిన మాట నిలబెట్టుకోండి



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** వెలుగొండ మొదటి టన్నెల్‌కు రూ.1000 కోట్లు ఇచ్చి నెల్లూరు జిల్లాకు నీరు అందించి మీరు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని బిజెపి నమామికంగా రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ జిల్లా కార్యవర్గ సభ్యుడు నరాల సుబ్బారెడ్డిలు సీఎం నెల్లూరు జిల్లా పర్యటన సందర్భంగా ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 1996లో మీరు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు శంకుస్థాపన చేసిన వెలుగొండ ప్రాజెక్టు 2014 సంవత్సరానికి పూర్తి కావలసి ఉంది. కేవలం నిధులు కొరత వలన ఈ ప్రాజెక్ట్ నిరుపయోగంగా ఉంది. వెలిగొండ మొదట టన్నెల్ పూర్తయింది. కాలువల ద్వారా నెల్లూరు జిల్లాలోని 84వేల ఎకరాలకు నీరు అందించడం కోసం భూ నిర్వాసితుల సమస్య మాత్రమే ఉంది. నిర్వాసితుల సమస్యను పరిష్కరించినట్లయితే ఉదయగిరి వరికుంటపాడు దుత్తలూరు మర్రిపాడు మండలాల ద్వారా 84 వేల ఎకరాలకు సాగునీరు త్రాగునీరు అందుతుంది. గోదావరి కృష్ణా జలాల బనకచర్ల తో అనుసంధానం చేయడం కోసం 80వేల కోట్ల రూపాయలకు పైగా ఖర్చవుతుంది దీర్ఘకాలికంగా సమయం తీసుకుంటుంది. వెలుగొండకు కనీసం రూ.1000 కోట్లు కేటాయించినట్లయితే మొదటి టన్నుల్ నుండి నెల్లూరు జిల్లాకు నీరు అందుతుంది. మీరు 1996లో ముఖ్యమంత్రిగా మీరు ఇచ్చిన హామీని తక్షణం నెరవేర్చుకున్నట్లయితే నెల్లూరు జిల్లా మెట్ట ప్రాంత వాసుల జీవితాలలో అభివృద్ధి నెలకొంటుంది. వెలుగొండ పూర్తి చేసేందుకు రూ.4వేల కోట్ల రూపాయల అవసరమని జల వనరుల శాఖ మంత్రి చెబుతున్నారు. కేవలం రూ.1000 కోట్లతో పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్కు నిరందిస్తే మెట్ట ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. మీ వాగ్దానాన్ని అమలు చేసి జిల్లా ప్రజలకు న్యాయం చేయాలని మిడతల రమేష్ మెట్ట ప్రాంతం మర్రిపాడు మండలానికి చెందిన నరాల సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# ఉచిత మెడికల్ క్యాంప్

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** పేదలకు ఉచితంగా వైద్యం అందించాలనే ఉద్దేశం నెల్లూరు నగరంలోని గుర్రాల మడుగు సంఘంలో జనసేన పార్టీ ఆశయాలను ముందుకు తీసుకొని వెళ్లేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా పర్యవేక్షకులు ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ తెలిపారు. ఆదివారం గునుకుల కిషోర్, సతీమణి విజయలక్ష్మి ఆధ్వర్యంలో 16 డివిజన్, గుర్రాల మడుగు సంఘంలో మెడికల్ క్యాంపు నిర్వహించి ఈసీజీ పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వడం ఎంతో సంతోషకరమన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డివిజన్లో మెడికల్ క్యాంపు నిర్వహించేందుకు కృషి చేసిన గునుకుల విజయలక్ష్మి పదహారో డివిజన్ నాయకులు నరహరి, వెంకటరమణ, డాక్టర్లకు మెడికల్ సిబ్బందికి అభినందనలు తెలిపారు. జనసేన పార్టీ సమస్యలను ప్రశ్నిస్తూ ప్రజలకు చేరువ అయిందని, ఇప్పటివరకు అభివృద్ధిని ప్రశ్నించిన జనసేన పార్టీ ప్రజలకు సేవలను అభివృద్ధిని అందించడంలో ముందడుగు వేస్తుందని నాదెండ్ల మనోహర్ పౌర సరఫరాల మంత్రిగా విద్యార్థులకు అంగన్వాడీ కేంద్రాలకు ఉచిత మధ్యాహ్న భోజన పథకం కింద సన్న బియ్యం సరఫరా చేయిస్తూ నాణ్యమైన సరుకులు పౌరులకు అందేవిధంగా జరిగిన కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాష్ట్ర ప్రజల ప్రతి ఒక్కరికి 25 లక్షల రూపాయల బీమా వర్తింపజేసేటట్టు రానున్న ఆర్థిక సంవత్సరంలో బిల్లును ప్రవేశపెట్టనున్నారని ప్రజా రంజకమైన సాగిస్తున్న పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రతి ఒక్కరు ముందుకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ఆరోగ్యాన్ని



సైతం లెక్కచేయకుండా రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా ప్రజల సంక్షేమమే ఆశయంగా పనిచేస్తున్న పవన్ కళ్యాణ్ పూర్తిగా కోలుకుని ప్రజాక్షేత్రంలో మరిన్ని సేవలు సాగించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా పర్యవేక్షకులు సీనియర్ నాయకులు మల్లికార్జున యాదవ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుందర్ రామిరెడ్డి, కార్యాలయం ఇన్‌చార్జ్ జమీర్, సిటీ పర్యవేక్షకులు జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, సతీమణి విజయలక్ష్మి, నెల్లూరు రూరల్ పర్యవేక్షకులు చంద్రశేఖర్ రెడ్డి, జనసేన నాయకులు మురళీకృష్ణ, కృష్ణ పెన్న జిల్లాల కోఆర్డినేటర్లు విజయలక్ష్మి, నాగరత్నం, హైమావతి, రేవతి, గజరాజు శాంతి కల, శాంభవి, జిల్లా అధికార ప్రతినిధి కారంపూడి కృష్ణారెడ్డి, డివిజన్ నాయకులు నరహరి, వెంకటరమణ, యాసిన్, అబీద్, శ్రీకాంత్, హుస్సేన్, వెంకీ, వసీం, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.


సూర్య



విలేకర్లు కావలెను

తెలుగు పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దినపత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

నెల్లూరు జిల్లాలోని బుచ్చిరెడ్డిపాలెం, సంగం, కొడవలూరు, వెంకటాచలం,మనుబోలు, అల్లూరు, దగదర్తి, వింజమూరు దుత్తలూరు. నెల్లూరు పట్టణంలో దర్గామిట్ట, స్టోన్‌హౌస్‌పేట, వేదాయపాలెం, బాలాజీ నగర్‌లలో విలేకర్లు కావలెను.

మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

నేటి దినపత్రిక సూర్య కార్యాలయం
మిలటరీ కాలనీ, రోడ్ నెం.1,ఎల్ఐసి & సిడిఐ ఆఫీసు ఎదురుగా,
కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు
9000118811, 9963827227


## పురుషామృగవాహన సేవలో శంకరుడు





**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరం మూలాపేటలోని శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం చప్పర ఉత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవంకు ఉభయకర్తలుగా డి.మోహన్ దంపతులు వ్యవరించగా, రాత్రి జరిగిన పురుషామృగ వాహన సేవకు ఉభయకర్తలుగా కీ.శే కొట్రా వెంకట సుబ్బమ్మ జ్ఞాపకార్థం వెంకట కృష్ణమూర్తి వ్యవహరించారు. ఈ వేడుక చూడడానికి భక్తులు విశేషంగా తరలి వచ్చారు. భక్తులకు దేవ స్తానం వారు తీర్థ ప్రసాదాలు అందించారు. వేడుకలు దేవస్థాన కార్యనిర్వహణాధికారి, ఆలయ సిబ్బంది ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

## మురుగుళ్ళలో చేపలపెంపకం, నీటిపారుదల వివాదం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం మురుగుళ్ళలో చెరువులో చేపల పెంపకం, సాగునీటి పారుదల విషయమై రైతులకు, మత్స్య కారులకు మధ్య వివాదం రేగింది. ఇరువురి ఫిర్యాదుల మేరకు ఆదివారం జిల్లా మత్స్యశాఖ అధికారులు గ్రామానికి విచ్చేసి విచారణ జరిపారు. చెరువులో చేపలపెంపకం ద్వారా తాము జీవనోపాధి పొందుతున్నామని, పెంపకం అడ్డుకోవడం అన్యాయమని మత్స్యకారులు పేర్కొన్నారు. వారికి న్యాయం జరుగకుంటే సమించేదిలేదని, జిల్లా స్తాయిలో ఉద్యమిస్తామని ఆత్మకూరు పట్టణ సిపిఎం కార్యదర్శి కె.డేవిడ్‌రాజు అధికారులకు తెలిపారు. కాగా తూములకు వలలు ఏర్పాటుచేస్తే నీటిపారుదల సక్రమంగా జరగబోదని, తమ పైర్లకు ఇబ్బందికరంగా ఉంటుందని గ్రామ రైతులు అధికారులకు వివరించారు. ఇరువర్గాల విన్నపాలు, వాదనలు విన్న అధికారులు ఇరువురి అభిప్రాయాలతో కూడిన నివేదికలను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని, ఆనిర్ణయం ప్రకారం తాము చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.